ఊరించి.. ఉసూరుమనిపించి!

వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో ఓటమి • డబ్ల్యూటీసీ ఫైనల్లోనూ ఇదే కథ

రాణించిన అథ్లెట్లు • ఆసియా క్రీడల్లో నయాచరిత్ర

-నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

కాలగమనంలో మరో ఏడాది కలిసిపోనుంది! ఏన్నో ఆశలతో నూతన సంవత్సరం కోసం ఎదురు చూస్తున్న సమయంలో.. ఈ ఏడాది క్రీడారంగంలో జరిగిన ప్రముఖ సంఘటనలను ఓసారి నెమరువేసుకుంటే..

పుష్కర కాలం తర్వాత స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో కోటి ఆశలు రేపిన టీమ్‌ఇండియా తుదిమెట్టుపై బోల్తా పడగా.. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లోనూ అదే ఫలితం ఎదురైంది! జావెలిన్‌లో నీరజ్ చోప్రా తనకు తిరుగులేదని నిరూపించుకుంటే.. చదరంగంలో మన గ్రాండ్‌మాస్టర్లు విశ్వ యవనికపై సత్తాచాటారు. ఆర్చర్లు అదుర్స్ అనిపించుకుంటే.. న్యాయం కోసం పోరాటం చేస్తూ రెజ్లర్లు ఏడాదంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు! బాక్సింగ్‌లో తెలంగాణ తార నిఖత్ జరీన్ తళుక్కుమంటే.. బ్యాడ్మింటన్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జంట కొత్త రికార్డులు నెలకొల్పింది. గ్రాండ్‌స్లామ్‌లు, సూపర్ సిరీస్‌లు, ఐపీఎల్ ఇలా లెక్కకు మిక్కిలి ఈవెంట్లు క్రీడాభిమానులను అలరించగా.. ఐపీఎల్ వేలంలో ఆస్ట్రేలియా పేసర్ స్టార్క్ రూ. 24.75 కోట్లు కొల్లగొట్టి ఆశ్చర్యపరిచాడు.

నాలుగేండ్ల నుంచి ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన భారత అభిమానులకు ఈసారి కూడా నిరాశ తప్పలేదు. ప్రతిష్ఠాత్మక ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది. 2011లో స్వదేశంలో జరిగిన వరల్డ్‌కప్ నెగ్గిన భారత్.. పుష్కర కాలం తర్వాత మన దేశంలో జరిగిన టోర్నీలో విజేతగా నిలిచి ముచ్చటగా మూడోసారి ట్రోఫీ చేజిక్కించుకుంటుంది అనుకుంటే.. అది అత్యాశే అయింది. లీగ్ దశలో ఎదురైన ప్రత్యర్థులందరినీ చిత్తుచేసిన రోహిత్ సేన్ సెమీఫైనల్లోనూ అద్వితీయ విజయం సాధించి.. ప్రపంచ చాంపియన్ హోదాకు అడుగు దూరంలో నిలిచింది. ఆస్ట్రేలియాతో జరిగిన తుదిపోరులో రోహిత్, కోహ్లీ, రాహుల్ తప్ప మిగిలినవాళ్లంతా చేతులెత్తేయడంతో టీమ్‌ఇండియాకు పరాజయం తప్పలేదు. అహ్మదాబాద్ స్టేడియం నీలి సంద్రాన్ని తలపించగా.. లక్షా ముప్పై వేల మంది ప్రేక్షకులను నిశ్శబ్దంగా ఉంచడం కన్నా పెద్ద విజయం ఏముంటుందని చెప్పి మరీ బరిలోకి దిగిన ఆసీస్ సారథి కమిన్స్ అందుకు తగ్గట్లే కోట్లాది మంది అభిమానులను కన్నీట ముంచాడు. అంతకుమందు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లోనూ భారత జట్టు ఆస్ట్రేలియా చేతిలోనే ఓడింది.

ఆసియా క్రీడల్లో అదుర్స్

కరోనా కారణంగా ఆలస్యంగా జరిగిన ఆసియా క్రీడల్లో మనవాళ్లు దుమ్మురేపారు. షెడ్యూల్ ప్రకారం నిరుడు జరగాల్సిన క్రీడలను మహమ్మారి కారణంగా ఈ యేడు నిర్వహించగా.. ఎప్పుడూ లేని విధంగా మనవాళ్లు పతకాల సెంచరీ కొట్టారు. అథ్లెటిక్స్ సహా అన్నీ క్రీడల్లో సత్తాచాటిన ప్లేయర్లు మొత్తం 107 పతకాలు కైవసం చేసుకున్నారు. అందులో 28 స్వర్ణాలు, 38 రజతాలు, 41 కాంస్యాలు ఉన్నాయి. స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ చోప్రా తన బడిశె పదును చూపితే.. పారుల్ చౌదరి ట్రాక్‌పై అద్భుతాలు చేసింది. తేజిందర్ పాల్ సింగ్ తూర్ షాట్‌పుట్‌లో నయా రికార్డు నెలకొల్పితే.. తెలంగాణ గురుకుల విద్యార్థిని అగసర నందిని హెప్టాథ్లాన్‌లో కాంస్య పతకంతో మెరిసింది. బ్యాడ్మింటన్‌లో స్టార్ షట్లర్ పీవీ సింధు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోగా.. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట నమ్మశక్యం కాని విజయాలతో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ కైవసం చేసుకుంది. హైదరాబాదీ షూటర్ ఇషాసింగ్ ఏషియన్ గేమ్స్‌లో నాలుగు పతకాలతో అదరగొట్టింది. బాక్సింగ్‌లో నిఖత్ జరీన్, ఆర్చరీలో వెన్నం జ్యోతి సురేఖ రాణిస్తే.. హాకీలో అటు పురుషుల జట్టు ఇటు మహిళల జట్టు చెప్పుకోదగ్గ విజయాలు సాధించాయి. భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలిగా పరుగుల రాణి పీటీ ఉషా ఉన్న సమయంలోనే.. రెజ్లింగ్‌లో లైంగిక వేధింపుల అంశం అంతర్జాతీయంగా భారత పరువు తీసింది. న్యాయం కావాలంటూ స్టార్ రెజ్లర్లు రొడ్డెక్కగా.. పోలీసులు వారిని అవమానకర రీతిలో అడ్డుకున్నారు. ఎన్నెన్నో మలుపులు తిరిగిన మల్లయోధుల 'కుస్తీ' ఇప్పటికీ ఒక కొలిక్కి రాకపోగా.. కబడ్డీకి అంతర్జాతీయంగా మరింత ప్రాధాన్యత పెరిగింది. రానున్న కాలంలో ఒలింపిక్స్ నిర్వహణకు బిడ్ వేయాలని కేంద్ర ప్రభుత్వం యోచనలు చేస్తుండగా.. ఐపీఎల్ వేలం యావత్ ప్రపంచాన్ని ముక్కున వేలేసుకునేలా చేసింది. చాన్నాళ్లుగా ఐసీసీ టైటిల్ నెగ్గాలని తహతహలాడుతున్న భారత క్రికెట్ జట్టు మరి వెస్టిండీస్ వేదికగా జరగనున్న టీ20 ప్రపంచకప్‌లోనైనా విశ్వ విజేతగా నిలుస్తుందా చూడాలి. ఈ ఏడాది పారిస్ వేదికగా ఒలింపిక్స్ జరగనుండగా.. ఇప్పటి నుంచే స్టార్ ప్లేయర్లంతా వాటి కోసం సన్నాహకాల్లో మునిగిపోయారు. మరింకెందుకూ ఆలస్యం మీరు కూడా మన అథ్లెట్లకు ఆల్ ది బెస్ట్ చెప్పేయండి!

ఆగని ఆగ్రహ జ్వాల

అవార్డులు వెనక్కి ఇచ్చేసిన స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పేరు ప్రఖ్యాతాలు తెచ్చిన స్టార్ రెజ్లర్ల అవార్డుల వాపసీ కార్యక్రమం కొనసాగుతున్నది. జాతీయ రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ అనుచరుడు ఎంపికవడంతో ఆగ్రహించిన రెజ్లర్లు.. ఒక్కొక్కరుగా తమకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అవార్డులను వెనక్కి ఇచ్చేస్తున్నారు. ఇప్పటికే సాక్షి మాలిక్ రెజ్లింగ్‌కు వీడ్కోలు పలకగా.. బజరంగ్ పునియా ఖేల్‌రత్నా, పద్మశ్రీ అవార్డులను తిరిగి ఇచ్చేశాడు. ఇప్పుడు ఆ జాబితాలో మరో రెజ్లర్ వినేశ్ ఫొగాట్ కూడా చేరింది. వినేశ్ శనివారం తనకు వచ్చిన ఖేల్‌రత్న, అర్జున అవార్డులను తిరిగి ఇచ్చేసింది. ప్రధాని కార్యాలయానికి వెళ్లాలని ప్రయత్నించిన స్టార్ రెజ్లర్‌ను పోలీసులు అడ్డుకోవడంతో.. వినేశ్ తనకు వచ్చిన పురస్కారాలను కర్తవ్య పథ్‌లో నడిరోడ్డుపై వదిలేసి వెళ్లింది. ఇటీవల జరిగిన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్ష ఎన్నికల్లో సంజయ్ సింగ్ గెలుపొందగా.. దీనికి నిరసనగా రెజ్లర్లు తిరిగి పోరుబాట పట్టారు. గతంలో లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న బ్రిజ్‌భూషణ్ కనుసన్నల్లోనే తిరిగి డబ్ల్యూఎఫ్ఐ నడుస్తున్నదనే ఆవేదనతో మల్లయోధులు అవార్డులు వెనక్కి ఇచ్చేయాలని నిర్ణయించుకున్నారు.

నీఐఎస్‌నీఈ జాతీయ కరాటే చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన గంగవరపు ప్రణీత స్వర్ణ పతకంతో మెరిసింది.

హెచ్‌సీఏ అక్రమాలపై ఈడీ విచారణ

- మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ ఎమ్మెల్యే వినోద్‌కు నోటీసులు
- జనవరి మొదటి వారంలో హాజరు కావాలని ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అక్రమాలపై, ఈడీ విచారణ కొనసాగుతున్నది. హెచ్‌సీఏలో జరిగిన రూ.20 కోట్ల నిధుల స్వాహాపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతున్నది. ఈ అక్రమాలపై ఇప్పటికే మాజీ క్రికెటర్లు ఆర్జద్ ఆయూబ్, శివలాల్ యాదవ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరెట్ (ఈడీ) అధికారులు రెండు రోజుల పాటు విచారించి.. హెచ్‌సీఏ మాజీ అధ్యక్షులు, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌కు నోటీసులు జారీ చేశారు. జనవరి మొదటి వారంలో ఈడీ ఎదుట హాజరుకావాలని వినోద్‌కు నోటీసులు పంపారు. కాగా ఉప్పల్ స్టేడియం మరమ్మతుల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడి నిధులు స్వాహా చేశారని, అవినీతి నిరోధక శాఖ మూడు కేసులు నమోదు చేసింది. ఈ కేసుల ఆధారంగా మనీ లాండరింగ్ చట్టం కింద మరో కేసును నమోదు చేసిన ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఇదే వ్యవహారంలో నవంబర్‌లో తెలంగాణ వ్యాప్తంగా 9 చోట్ల సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో డాక్యుమెంట్లు, డిజిటల్ పరికరాలు, రూ.10,39,000ల నగదును ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాణిజ్య అవసరాలకు ఉప్పల్ స్టేడియంలో నిర్మాణాలు చేపట్టొద్దని ప్రభుత్వం ఒప్పందంలో పేర్కొన్నా.. దాన్ని ఉల్లంఘించారని, వాణిజ్య ప్రయోజనాలకు అనుగుణంగా స్టాండ్‌ల నిర్మాణాలు జరిగాయని ఏసీబీ తెలిపింది.

ఉప్పల్ స్టేడియాన్ని ఆధునీకరిస్తాం

ఈడెన్ గార్డెన్స్‌ను సందర్శించిన హెచ్‌సీఏ అధ్యక్షుడు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రపంచలోని ప్రఖ్యాత క్రికెట్ మైదానాలను పరిశీలించి వాటికి దీటుగా.. ఉప్పల్ స్టేడియంను తీర్చిదిద్దుతామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు వెల్లడించారు. ఉప్పల్ మైదానాన్ని నవీకరించే ముందు ప్రపంచంలోని అధునాతన క్రికెట్ మైదానాలను పరిశీలించి అధ్యాయనం చేస్తామన్నారు. ఇందులో భాగంగా శనివారం కోల్‌కతాలోని ప్రఖ్యాత ఈడెన్ గార్డెన్స్ స్టేడియంను జగన్‌మోహన్ రావు సందర్శించారు. బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు స్నేహాశీష్ గంగూలీతో భేటీ అయ్యారు. మైదానం అభివృద్ధికి తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాల సమయంలో పిచ్‌ను ఆరబెట్టడానికి ఎలాంటి పద్ధతులు వినియోగిస్తున్నారని కనుక్కున్నారు.

సెయిలింగ్ చాంపియన్ లాహిరి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాష్ట్ర సెయిలింగ్ చాంపియన్‌షిప్‌లో కొమరవెల్లి లాహిరి విజేతగా నిలిచింది. హైదరాబాద్ హుస్సేన్ సాగర్‌లో శనివారం ముగిసిన టోర్నీలో లాహిరి సబ్ జూనియర్ విభాగంలో స్వర్ణం సొంతం చేసుకోగా.. ఆమె సోదరి కొమరవెల్లి దీక్షిత రెండో స్థానంలో నిలిచి రజత పతకం చేజిక్కించుకుంది. మూడు రోజుల పోటీల్లో అదరగొట్టిన ఈ అక్కాచెల్లెల్లు చెరో 15 పాయింట్లతో సమంగా నిలిచారు. ఐదు రేసుల్లో విజేతగా నిలిచిన లాహిరిని నిర్వాహకులు విజేతగా ప్రకటించారు. బాలుర విభాగంలో బన్నీ స్వర్ణం గెలుచుకోగా.. వినోద్, రిజ్వాన్ వరుసగా రజత కాంస్యాలు దక్కించుకున్నారు.

మూడు పరుగుల దూరంలో

- సిరీస్ చేజిక్కించుకున్న ఆస్ట్రేలియా
- దీప్తి, రిచ పోరాటం వృథా

రెండో వన్డేలో భారత మహిళల ఓటమి

గత మ్యాచ్ పరాజయాన్ని పక్కనపెట్టి సాధికారికతతో బరిలోకి దిగిన భారత మహిళల జట్టుకు మరోసారి నిరాశ తప్పలేదు. బౌలింగ్‌లో దీప్తి శర్మ పాంచ్‌పటాకాతో విజృంభించడంతో ఆస్ట్రేలియాను ఓ మాదిరి స్కోరుకే పరిమితం చేసిన టీమ్‌ఇండియా.. హోరాహోరీ పోరులో విజయానికి మూడు పరుగుల దూరంలో నిలిచిపోయింది. వికెట్ కీపర్ రిచ ఘోష్ అద్వితీయ పోరాటం వృథా కాగా.. ఆసీస్ 2-0తో సిరీస్ చేజిక్కించుకుంది!

రిచ (96)

ముంబై: సొంతగడ్డపై వరుస టెస్టు విజయాలు ఇచ్చిన ఉత్సాహంలో ఉన్న భారత మహిళల జట్టు అదే జోష్‌లో వన్డే సిరీస్‌లోనూ దుమ్మురేపాలని చూసినా.. ఉత్కంఠ పోరులో ఆస్ట్రేలియా విజయం సాధించింది. చివరి వరకు గెలుపు మనదే అనిపించినా.. ఒత్తిడిని అధిగమించడంలో ఘనపాటులైన కంగారూలు పట్టు వదలక సిరీస్ కైవసం చేసుకుంది. వాంఖడే వేదికగా శనివారం జరిగిన రెండో వన్డేలో భారత్ 3 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే ఆస్ట్రేలియా 2-0తో కైవసం చేసుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. లిచ్‌ఫీల్డ్ (63), ఎలీసా పెర్రీ (50) అర్ధశతకాలు సాధించారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ 5 వికెట్లు పడగొట్టగా.. పూజ, శ్రేయాంక, స్నేహ్ రాణా తలా ఒక వికెట్ తీశారు. ఒక దశలో 117/1తో పటిష్ఠ స్థితిలో కనిపించిన ఆసీస్‌ను దీప్తి దెబ్బకొట్టింది. అయితే మరింత ఒత్తిడి పెంచడంలో విఫలమైన మన బౌలర్లు కంగారూలకు మంచి స్కోరు చేసే అవకాశమిచ్చారు. అనంతరం లక్ష్యఛేదనలో టీమ్‌ఇండియా 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. వికెట్ కీపర్ రిచ ఘోష్ (96; 13 ఫోర్లు) తృటిలో సెంచరీ చేజార్చుకోగా.. జెమీమా రోడ్రిగ్స్ (44), స్మృతి మంధన (34) పోరాడారు. 218/4తో సునాయాసంగా గెలిచేలా కనిపించిన భారత్ చివర్లో ఒత్తిడికి లోనై వరుస వికెట్లు కోల్పోయింది. దీంతో సాధించాల్సిన రన్‌రేట్ పెరిగిపోగా.. చివరి ఓవర్‌లో విజయానికి 16 పరుగులు అవసరంగా కాగా.. 12 రన్సే చేయగలిగింది. ఆసీస్ ఆల్‌రౌండర్ అనాబెల్ సదర్లాండ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య నామమాత్రమైన చివరి వన్డే మంగళవారం జరగనుంది.

అటు దీప్తి.. ఇటు రిచా

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ప్రారంభించిన తీరు చూస్తూ.. ఆ జట్టు మరింత భారీ స్కోరు చేయడం ఖాయమే అనిపించింది. పేస్, స్పిన్ అనే తేడా లేకుండా కంగరూలు సాధికారతతో ముందుకు సాగడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఓపెనర్ లిచ్‌ఫీల్డ్, పెర్రీ అర్ధశతకాలతో మంచి జోరు మీదున్న సమయంలో బంతినందుకున్న దీప్తి.. కంగారూలను కట్టడి చేయడంలో సఫలమైంది. మొదట పెర్రీని బుట్టలో వేసుకున్న దీప్తి.. ఆ తర్వాత బెత్ మూనీ (10)ని వికెట్ల ముందు దొరకబుచ్చుకుంది. కాసేపటికి లిచ్‌ఫీల్డ్ ఔట్ కాగా.. చివర్లో అనాబెల్ (23), జార్జియా (22), అలానా (28 నాటౌట్) కీలక పరుగులు జోడించి ఆసీస్‌కు మంచి స్కోరు అందించారు. చేజింగ్‌లో భారత్‌కు చెప్పుకోదగ్గ ఆరంభం లభించలేదు. గత మ్యాచ్‌లో రాణించిన యస్తిక భాటియా (14) ఏడో ఓవర్‌లో వెనుదిరగగా.. వైస్ కెప్టెన్ స్మృతి మంధన ఆకట్టుకుంది. అయితే భారత ఇన్నింగ్స్‌ను నడిపించి ఘనత మాత్రం రిచకే దక్కుతుంది. ఆరంభంలో కాస్త ఆచితూచి ఆడిన రిచ అర్ధశతకం అనంతరం ఎడాపెడా బౌండ్రీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. జెమీమా సహకారంతో జట్టును విజయతీరాలకు చేరువ చేసే ప్రయత్నం చేసిన రిచ.. సెంచరీకి నాలుగు పరుగుల దూరంలో ఔటైంది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ పేలవ ఆటతీరుతో వికెట్ పారేసుకోవడంతో జట్టుకు పరాజయం తప్పలేదు.

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా: 258/8 (లిచ్‌ఫీల్డ్ 63, ఎలీసా పెర్రీ 50; దీప్తి శర్మ 5/38), భారత్: 255/8 (రిచ 96, జెమీమా 96; అనాబెల్ 3/47).

స్నేహ్ రాణా కంకషన్

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తున్న భారత ఆల్‌రౌండర్ స్నేహ్ రాణా సహచర ఫీల్డర్‌ను ఢీకొనడంతో తలకు గాయమైంది. అనంతరం తల తిరిగినట్లు అనిపిస్తుందని స్నేహ్ రాణా చెప్పడంతో వెంటనే ఆమెను వైద్య సాయం కోసం పంపారు. స్నేహ్ స్థానంలో కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా హర్లీన్ డియోల్ మిగిలిన మ్యాచ్ ఆడింది.

శిజు సిక్సర్

సౌత్ జోన్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన జోనా శిజు ఆరు పతకాలతో అదరగొట్టింది. బెంగళూరులో జరిగిన ఈ పోటీల్లో జోనా.. ఒక స్వర్ణం, నాలుగు రజతాలు, ఓ కాంస్యం కైవసం చేసుకుంది.

నిష్క పైఫర్

జూనియర్ నేషనల్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జిమ్నాస్ట్ నిష్క అగర్వాల్ పాంచ్ పటాకా మోగించింది. ఒడిశాలో జరిగిన పోటీల్లో మూడు స్వర్ణాలు, ఒక రజతం, ఓ కాంస్యం కైవసం చేసుకుంది.

తెలంగాణ కబడ్డీ సంఘం మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా ఎన్నికైన రాజ్యలక్ష్మికి శనివారం హైదరాబాద్‌లో నియామకపత్రం అందజేస్తున్న కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.